# జైలుకథలు 16

## "ఆవారా"

ఆ రోజు ఆదివారం సాయంకాలం జైలు ఆవరణ కాస్త హడావిడిగా వుంది. కారణం మరేమీకాదు. ప్రతి ఆదివారం సాయంకాలం ఖైదీలకు మాంసంకూర యిస్తారు. బావివద్ద ప్లేట్లు, మగ్గులు, కడిగే వారితో కోలాహలంగా వుంది. బ్లాక్ బయట వరండాలో గోడకు ఆనుకొని అంతా గమనిస్తున్నాను. నాకు కొంచెం ఎడంగావున్న వేపచెట్టు మొదలు ఆనుకొని బీడీ కాలుస్తున్నాడు కానిస్టేబుల్ గంగారాం. ఖైదీలుకొంతమంది కిచిన్ వద్ద గుమిగూడారు. వారిని దూరంగా పొమ్మని కేకలేస్తున్నాడు వంట చేసే నాయర్. "ఏమండీ" పిలుపు విన వచ్చిన దిక్కుగా చూశాను. చింపిరి జుత్తు, కోలముఖం, అర్ధనిక్కరు, దానిమీద అక్కడక్కడా చిరుగులు పట్టిన చొక్కా. వయసు పన్నెండు, పదమూడు సంవత్సరాలుండవచ్చు. అతన్ని చూడగానే నాలో ఒకరకమైన అభిమానం కలిగింది.

"రా బాబూ కూర్చో" అన్నాను. ఒక ప్రక్కగా వొద్దికగా కూర్చున్నాడు తల వంచుకొని.

"చెప్పు ఏం కావాలి?" నా ప్రశ్నకు మెల్లగా తలెత్తాడు. కళ్ళనిండుగా నీరు. నా మనసు కొంచెం బాధపడింది.

"చూడు బాబూ ఏడ్చి లాభం లేదు. ఇక్కడ మనమంతా అన్నతమ్ములం. మన వారంటూ ఎవరూ అందుబాటులో లేనప్పుడు మనకు దగ్గరలోవున్న వారెవరైనా మనవారే-బాధపడకు, విషయం చెప్పు" అన్నాను. సమాధానంగా జేబులో నుండి "ఛార్జిషీటు" తీసి నా ముందుంచాడు. చదివాను. అది 109వ సెక్షను క్రింద నమోదు చేయబడిన కేసు. దీనినే 'ఆవారా' కేసు అంటారు. ఇది పోలీసువారి పాలిటి కల్పతరువు. ఎవరో వూరూ, పేరూ లేనివారిని పట్టుకొని లాకప్‌లో పెట్టి, వారు ఎక్కడో అర్ధరాత్రి తాళం తీయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు, అడ్రసు అడిగితే సరిగా చెప్పనట్లు కేసు నమోదు చేస్తారు.

ఈ కేసులకు సామాన్యంగా హామీ (ష్యూరిటీ) మీద వదిలివేస్తారు. ఆ హామీలు కూడ పోలీసువారే తీసుకొస్తారు. ఆ వచ్చిన వారికి వారికి పోలీసువారే డబ్బుయిస్తారు. ఈ కేసుల వల్ల రిజిష్టర్లు నింపుకొని ప్రమోషన్లు సంపాయిస్తారు. అమాయకులైన పనివారిని జైలుపాలు చేస్తారు. శిక్ష సామాన్యంగా వేయరు, ప్రొబేషన్ యాక్టు క్రింద వదిలేస్తారు.

శాయిది అనంతపురం. తండ్రి సైకిళ్ళు రిపేరు చేస్తుంటాడు. తల్లి చనిపోయిన తరువాత మరలా పెండ్లి చేసుకొన్నాడు. పినతల్లి శాయిని ప్రేమగా చూడక చాల ఇబ్బందులు పెట్టేది. పినతల్లికి ఒక ఆడపిల్ల కలిగింది. చిన్న వయసని కూడ జాలి లేకుండా శాయిచేత యింటిపని అంతా చేయించేది. పైగా సాయంకాలం తండ్రి రాగానే చాడీలు చెప్పి కొట్టించేది. రాను రాను శాయి జీవితం దుర్భరంగా మారిపోయింది. తన వయసు పిల్లలతో కలిసి తిరగడానికి వీలులేదు. ఆడుకోకూడదు.

ప్రొద్దుటే లేచి యిల్లూ వాకిలీ వూడ్చాలి. ప్రక్కలు తీయాలి. నీళ్ళు తేవాలి. బజారుపని చేయాలి. దేనికీ ఆలస్యం




కావడానికి వీలులేదు. పిన్ని పెట్టినది తిని మేకలు తోలుకొనిపోవాలి. మరలా ఇంటికి వచ్చిన తరువాత నీళ్ళు తేవాలి. ప్రక్కలు వేయాలి, ఇంతచేసినా మధ్యాహ్నం అన్నం వుండేదికాదు.

వొకనాడు తన ఈడువాడే ఐన ప్రక్కయింటి వీరన్నకొడుకు వచ్చాడు. వాడు యిల్లు వదలిపోయి చాలకాలమైంది. మంచి బట్టలతో వచ్చాడు. చాల బొద్దుగా, ముద్దుగా, ఆనందంగా వున్నాడు. వాడే చెప్పాడు హైదరాబాద్ హోటల్‌లో పనిచేస్తున్నాడంట. మంచి భోజనం, కాఫీ, టిఫిన్, నెలకు నూరురూపాయల జీతం అని చెప్పాడు. సినిమాలు చూడవచ్చు. హాయిగా వుండవచ్చునన్నాడు. ఆ రోజు శాయి నీళ్ళు తెస్తున్నాడు. వాకిట్లోకి వచ్చి మెట్టు మీద కాలు వేశాడు. కాలు జారింది. పడ్డాడు బిందె పగిలింది. ఇప్పుడు పిన్ని తిట్లు, దెబ్బలు, సాయంకాలం నాన్న దెబ్బలు తలుచుకొని భయపడ్డాడు. ఆ వెంటనే హైదరాబాద్, మంచి అన్నము, కాఫీ, టిఫిన్, నెలకు వంద రూపాయలు, సినిమాలు జ్ఞాపకం వచ్చాయి. అంతే ఇంటినుండి బయలుదేరాడు. బెంగుళూరు-సికిందరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. నిద్రలోవున్న శాయిని టి. టి. యి. వచ్చి లేపాడు. టికెట్ లేదు. మహబూబ్‌నగర్ స్టేషన్‌లో దింపాడు. వాడు బండి దిగాడో లేదో, వొక కానిస్టేబుల్ ఆయన దగ్గరగా వచ్చి ఏదో మాట్లాడి, శాయిని వెంటతీసికొని పోలీసుస్టేషన్‌కు వచ్చాడు. కాని వీరు పెట్టింది టికెట్టులేని కేసుకాదు. 'ఆవారా' కేసు. పైగా శాయిని అప్పగించినందుకు టి. టి యి.కి పది రూపాయలు యిచ్చాడు కానిస్టేబుల్!

—'ప్రసాద్'